ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 । కనిష్ఠం : 18.0
ANDHRAJYOTHY
3

మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
మంగళవారం 20 ఫిబ్రవరి 2024

ఉపాధి హామీ ఉద్యోగులకు..
జీతాల్లేవ్

- మూడు నెలలుగా అందని డబ్బులు
- ఖజానాలో సొమ్మంతా ఊడ్చేసిన గత ప్రభుత్వం
- కూలీల సంఖ్యను పెంచితేనే నిధులు వచ్చే అవకాశం
- మల్లగుల్లాలు పడుతున్నా పెరగని సంఖ్య
- ప్రతీ ఊరి నుంచి 50 మందికి తక్కువ కాకుండా చూడాలని ఆదేశాలు


నవాబ్‌పేటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. రోజు వారీగా కూలీలను పనికి తెస్తూ, వారికి పేమెంట్‌లు వచ్చేలా చేస్తున్న ఆ ఉద్యోగులు తమ జీతాల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. గత ప్రభుత్వం ఏడాదికి సరిపోయే బడ్జెట్‌ను తొమ్మిది నెలలకే ఊడ్చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఉపాధి హామీ పథకంలో ఏడాదికి సంబంధించిన బడ్జెట్‌ను ముందుగానే రూపొందిస్తారు. ఇందులో లేబర్ పేమెంట్‌కు అనుగుణంగా జిల్లాలో పని చేస్తున్న ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ఫీల్డ్ అసిస్టెంట్‌ల జీతాలకు బడ్జెట్ కేటాయిస్తారు. లేబర్ బడ్జెట్‌లో ఆరు శాతం అడ్మినిస్ట్రేషన్ ఎక్స్‌పెండీచర్‌గా నిర్ణయిస్తారు. ఈ ఆరు శాతంలోనే ఏడాదికి జీతాలు చెల్లించేలా ముందుగానే యాక్షన్ ప్లాన్ ఉంటుంది. జిల్లాలో ఈ ఏడాది ఉపాధి హామీ పథకం కింద రూ.54.65 కోట్లు కూలీలకు, రూ.44.76 కోట్లు మెటీరియల్ కోసం ఖర్చు చేయగా, డిసెంబర్ నాటికి రూ.5.77 కోట్లు అడ్మినిస్ట్రేటివ్ ఖర్చులకు వినియోగించారు.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

నిధుల మళ్లింపు..

ముందుగానే ఖర్చు

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి ఖర్చు చేయాల్సిన నిధులను ఇతర పథకాలకు మళ్లించడం, ఉన్న బడ్జెట్‌ను ముందుగానే ఊడ్చేయడంతో ఖజానా ఖాళీ అయ్యింది. డిసెంబర్ నాటికే ఆరు శాతం అడ్మినిస్ట్రేషన్ ఖర్చుల డబ్బులను వాడుకోవటంతో జీతాలకు డబ్బులు లేకుండా పోయాయి. ఇప్పుడు జీతాలకు నిధులు జమ కావాలంటే... కూలీల సంఖ్యను పెంచాలి. వారికి ఎక్కువ పనిదినాలు కల్పిస్తే దాంట్లో ఆరు శాతం అడ్మినిస్ట్రేషన్ ఖర్చుకు జమవుతూ వస్తాయి.

ప్రతీ గ్రామానికి 50 మంది టార్గెట్

కూలీల సంఖ్య పెంచితే ఉద్యోగులకు జీతాలు వస్తాయని భావించిన ఉన్నతాధికారులు ఉద్యోగులకు టార్గెట్‌లు విధించారు. ఉదాహరణకు లేబర్ పేమెంట్ రూ.కోటి ఖర్చు చేస్తే అందులోంచి ఆరు శాతం అంటే రూ.ఆరు లక్షలు అడ్మినిస్ట్రేషన్ ఎక్స్‌పెండిచర్‌లో జమ అవుతాయి. అందుకే ప్రతీ గ్రామానికి 50 మందికి తక్కువ కాకుండా పని చేయాలని ఉద్యోగులకు ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం జిల్లాలో కేవలం 10,847 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఈ సంఖ్యను 25-30 వేలకు పెంచాల్సి ఉంది. ప్రస్తుతం ఎండలు పెరగడంతో కూలీలు పెరుగుతారో లేదో నన్న ప్రశ్న నెలకొంది. ఇప్పటికే 100 రోజులు వినియోగించుకున్న కుటుంబాలు పనికి వచ్చే అవకాశం లేనందున 60-70 రోజులు పని చేసిన కుటుంబాలను పనులకు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. అదే ఏప్రిల్‌లో అయితే కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానుండటంతో 100 రోజులు పనిచేసి వాళ్లంతా మళ్లీ పనులకు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే ఈ నెల రోజులు కూలీలు పనులకు వచ్చే అవకాశం అంతంతమాత్రంగానే ఉంది. దాంతో కూలీలను పనులకు తీసుకురావడానికి ఉద్యోగులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

యాప్‌లో తికమకలు

ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ యాప్‌ను తెచ్చింది. దీని ప్రకారం రోజూ రెండుసార్లు ఫీల్డ్ అసిస్టెంట్‌లు పని చేసే ప్రాంతానికి వెళ్లి లేబర్ ఫొటోలు తీయాల్సి ఉంటుంది. ఆధార్‌తో లింక్‌అయిన ఫొటో ఉంటేనే యాప్ అనుమతిస్తుంది. పని చేసేవాళ్ల ఫేస్ అథెంటికేషన్ చేయాల్సి ఉంటుంది. ఒకరిబదులు మరొకరు పనికి వెళ్లడానికి వీలులేదు. ఉదయం వెళ్లి పని ప్రదేశంలో ఫొటో తీసినపుడు లోకేషన్ చూయిస్తుంది. మళ్లీ సాయంత్రం ఫొటో తీసే సమయంలో ఆ లోకేషన్ 10 మీటర్లలోపు ఉంటేనే యాప్‌లో క్యాప్చర్ అవుతుంది. ఎక్కడో ఉండి తీస్తామంటే కుదరదు. ప్రతీ కూలీ పేరిట ఈకేవైసీ చేయాల్సి ఉంటుంది. దీన్ని ఎన్‌పీసీ(నేషన్‌పేమెంట్ సిస్టమ్ మాడ్యూల్) చేస్తే నేరుగా లబ్ధిదారు అకౌంట్‌ల్లో డబ్బులు జమఅవుతాయి. ప్రతీ రోజు ఫీల్డ్ అసిస్టెంట్ కచ్చితంగా అన్ని పనిప్రదేశాలకు వెళ్లి ఫొటోలు తీయాల్సి ఉంటుంది. లేదంటే ఆ రోజు కూలీలకు కూలీ ఇచ్చే పరిస్థితి ఉండదు.

రెగ్యులర్ పీవోను నియమించాలి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మన్ననూరులో ఏర్పాటు చేసిన ఐటీడీఏకు ఐఏఎస్ అధికారిని పీవోగా నియమించలేదు. రెగ్యులర్ పీవో ఉంటేనే చెంచులకు న్యాయం జరుగుతుంది. కార్యాలయ భవనాన్ని నిర్మించాలి. పాలక మండలిని ఏర్పాటు చేసి, సమావేశాలు జరపాలి.

- దాసరి శ్రీనివాసులు, మన్ననూరు ఎంపీటీసీ సభ్యుడు


సమస్యలు వినేవారేరీ?

మన్ననూరులో ఐటీడీఏలో సమస్యలు చెబుతామంటే ఇన్‌చార్జి అధికారులు కలిసే పరిస్థితి లేదు. పెంటల్లో ఐటీడీఏ అధికారులు పర్యటించాలి. అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి.

- బాల గురువయ్య, అప్పాపూర్ పెంట, మాజీ సర్పంచి

మన్ననూరు ఐటీడీఏకు..
మహర్దశ వచ్చేనా

- పదేళ్లుగా ఇన్‌చార్జి పీవోలతోనే కాలయాపన
- నిర్వహించని పాలక మండలి సమావేశాలు
- కుంటుపడుతున్న చెంచుల అభివృద్ధి


నల్లమలలోని ఓ చెంచు గుడిసె

మన్ననూర్, ఫిబ్రవరి 19: ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయిన నాగర్ కర్నూలు జిల్లా పరిధిలోని అమ్రాబాద్ మండలం మన్ననూరు ఐటీడీఏ కార్యాలయం పదేళ్లుగా ఇన్‌చార్జి పీవోల పాలనతోనే నడుస్తోంది. తాజాగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భద్రాచలం ఐటీడీఏను సందర్శించి, అక్కడి పాలక మండలి సభ్యులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని ఐటీడీఏల పరిస్థితిని బాగు చేస్తామని ప్రకటించడంతో స్థానిక చెంచు గిరిజనులు మన్ననూరు ఐటీడీఏనూ పట్టించుకోవాలని కోరుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

కార్యాలయంలో ఒకే ఉద్యోగి..

ప్రస్తుతం మన్ననూరు ఐటీడీఏలో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ జాఫర్ హుసేన్ మాత్రమే రెగ్యులర్ ఉద్యోగిగా ఉన్నారు. ఆయనే కార్యాలయ బాధ్యతలు చూస్తూ, చెంచుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఐటీడీఏలను బలోపేతం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. తాజాగా ఆదివారం ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క భద్రాచలం ఐటీడీఏలో అధికారులతో సమావేశం నిర్వహించి, ఐటీడీఏల ద్వారా చెంచులకు అభివృద్ధి ఫలాలు అందిస్తామని చెప్పారు. మన్ననూరు ఐటీడీఏలో నూ సమావేశాలు నిర్వహించి, కార్యాలయ సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని చెంచులు కోరుతున్నారు.

ఉమ్మడి రాష్ట్ర పాలనలో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 10 జిల్లాల ఐటీడీఏ నంద్యాల జిల్లా సున్నిపెంటలో ఉండేది. అక్కడే పాలక మండలి సమావేశాలు జరిగేవి. జీవీవీకే(గిరిజన విద్యావికాస కేంద్రాలు)ల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ప్రతీ నెల పీవో సమావేశం నిర్వహించి, మారుమూల చెంచు పిల్లల విద్యాభ్యాసంపై ఆరా తీసేవారు. వ్యవసాయ శాఖకు ఏవో ఉండేవారు. చెంచు రైతులకు సబ్సిడీపై ఖరీఫ్‌లో విత్తనాలు పంపిణీ చేసేవారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కూడా ఉండేవారు. వారు సంచార వైద్యశాలలు, చెంచుల వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. నల్లమల పెంటల్లో పీవో వారంలో రెండు రోజులు క్షేత్ర పర్యటనలు చేసి, చెంచుల సమస్యలను తెలుసుకొనేవారు.

తెలంగాణ ఏర్పడ్డాక ఇదీ పరిస్థితి..

తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో ఐటీడీఏను విభజించారు. తెలంగాణాలోని నాగర్‌కర్నూల్, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వికారాబాద్, పరిగి జిల్లాలకు కలిపి మన్ననూరులోని అప్పటి మాడా కార్యాలయానికి పీవో కార్యాలయాన్ని తరలించారు. తెలంగాణ వాటాకు వచ్చే కార్యాలయం సామగ్రిని సైతం మన్ననూరుకు తెచ్చారు. కానీ అప్పటి నుంచి నేటి వరకు ఇన్‌చార్జీ పీవోల పాలననే కొనసాగిస్తున్నారు. రెండేళ్ల కలెక్టర్లు మన్ననూరులో చెంచుల అభివృద్ధిపై నెలకొకసారి అన్ని శాఖల అధికారులతో స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత గిరిజన దర్బార్ నిర్వహించారు. కానీ వాటిని కొనసాగించడం మానేశారు. 10 ఏళ్లుగా ఇతర శాఖల్లో పనిచేసే అధికారులు డాక్టర్ వెంకటయ్య, మంగ్యా నాయక్, అశోక్, డాక్టర్ నవీన్ నికోలస్, డిప్యూటీ కలెక్టర్ మనూ చౌదరి, ప్రస్తుత నాగర్ కర్నూల్ కలెక్టర్ ఉదయ్ కుమార్‌లు ఇన్‌చార్జి పీవోలుగా బాధ్యతలు నిర్వహించారు. తాజాగా అటవీ శాఖ డీఎఫ్‌వో రోహిత్ గోపిడి ఇన్‌చార్జి పీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇన్‌చార్జీలుగా ఉన్న అధికారులు చెంచుల అభివృద్ధి కోసం నేరుగా పరిష్కారం చూపలేకపోతున్నారు. ప్రతీ పనికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖకు ఫైల్ పంపించాల్సి వస్తోంది. గతంలో రెగ్యులర్ పీవోలు ఉన్నప్పుడు చెంచులకు ఏదైన ఆపద వస్తే వారే తక్షణ చర్యలు తీసుకునేవారు.


కాలినడకన నిత్యావసర సరుకులు తీసుకెళ్తున్న చెంచులు (ఫైల్)

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

- రేపు కోస్గికి రేవంత్‌రెడ్డి
- అధికారులతో నారాయణపేట కలెక్టర్ సమావేశం


కోస్గిలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట, ఫిబ్రవరి 19: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 21న కోస్గిలో పర్యటించనున్నట్లు నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు మయాంక్ మిత్తల్, అశోక్ కుమార్‌తో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లపై కోస్గిలో అధికారులతో సమీక్షించారు. కోస్గి ప్రభుత్వ కళాశాల స్థలాన్ని పరిశీలించారు. పలు అభివృద్ధి పనులకు సీఎం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని, అందుకు శిలా ఫలకాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడ ఏర్పాటు చేయనున్న స్టాల్స్‌పై డీఆర్డీఏ అధికారులకు పలు సూచనలు చేశారు. మహిళా స్వశక్తి సంఘాలతో నిర్వహించే సమావేశానికి వేదికను ఏర్పాటు చేయాలని, లోటు పాట్లు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం సీఎం పర్యటనకు సంబంధించిన ప్రొటోకాల్‌పై తహసీల్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. ప్రొటోకాల్ విషయంలో పొరపాట్లు లేకుండా శిలా ఫలకాలను ప్రాధాన్యత క్రమంలో ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ కూడా ఏర్పాట్లను పరిశీలించారు.

జిల్లా అధికారులతో సమీక్ష..


సీఎం పర్యటన సందర్భంగా కోస్గి మునిసిపల్ కార్యాలయంలో జిల్లా అధికార యంత్రాంగంతో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ సమీక్ష చేశారు. పర్యటన ఏర్పాట్లపై బాధ్యతలు అప్పగించిన అధికారులు సమర్థవంతంగా పని చేయాలన్నారు. పర్యటన ముగిసే వరకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో రాంచందర్, జడ్పీ సీఈవో శైలజ, డిప్యూటీ సీఈవో జ్యోతి, వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, అటవీ శాఖ అధికారి వీణవాణి, బీసీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణమాచారి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కొండపైకి స్వామి వారు

- ప్రారంభమైన మన్యంకొండ బ్రహ్మోత్సవాలు


స్వామి వారిని ఊరేగింపుగా గుట్టపైకి తీసుకెళ్తున్న ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్, అర్చకులు

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 19 : మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి స్వామివారి బంగారు విగ్రహం, స్వామివారి బంగారు ఆభరణాలను సంప్రదాయం ప్రకారం ఆలయ ధర్మకర్త స్వగ్రామం కోటకదిరలోని తమ నివాసం నుంచి ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్, దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు, మండల నాయకులు, పెద్దలు, కోటకదిర, ఓబులాయపల్లి గ్రామాల పెద్దల సమక్షంలో ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా భక్తిశ్రద్ధలతో స్వామివారిని గుట్టపైకి తీసుకెళ్లారు. అనంతరం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణలు చేసి స్వామివారికి అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి స్వామివారికి తిరుచి సేవ నిర్వహించారు. నేడు రాత్రికి హంస వాహన సేవా కార్యక్రమం నిర్వహించనున్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి ఈనెల 23న స్వామివారికి ప్రభుత్వం తరుపున అధికారికంగా పట్టు వస్త్రాలను అందజేస్తారని దేవస్థాన కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్‌రాజు తెలిపారు.


తిరుచి సేవలో స్వామి వారు

సేవాభావంతో పనిచేయండి: ఎమ్మెల్యే

మన్యెంకొండ దేవస్థాన నూతన పాలక మండలి సేవాభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మన్యంకొండ దేవాలయంలో జరిగిన నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి సేవలో పాలక మండలి సభ్యులుగా మీ అందరికి సేవ చేసుకునే భాగ్యం దక్కడం అదృష్టంగా భావించాలన్నారు. ఆలయ చైర్మన్ అలహరి మధుసూదన్‌శర్మ, ఈవో శ్రీనివాసరాజు, పాలకమండలి సభ్యులు గోవింద్, ప్రభాకర్‌రెడ్డి, అలివేలమంగమ్మ, శంకర్, సుధ, వనజ, బాలరాజు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తాం

- పీఎం యూఎస్‌హెచ్‌ఏ పథకం కింద నిధులు మంజూరు
- అందరి కృషితోనే రూ.100 కోట్లు
- ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 19 : పాలమూరును ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పాలమూరు యూనివర్సిటీలో పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు యూనివర్సిటీతో తనకు అవినాభావ సంబంధం ఉందని తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి పోరాటాలు చేశామని అన్నారు. 2012లో తాను బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఇతర పార్టీల నాయకులు, మంత్రుల సహకారంతో పార్టీలకు అతీతంగా యూనివర్సిటీ కోసం రూ.8.7కోట్లు మంజూరు చేశామని, ఇప్పుడు పీయూకు కేంద్రం నుంచి రూ. 100 కోట్లు మంజురు కావడానికి పార్టీలకు అతీతంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు, డీకే అరుణ, అందరం కలిసి పనిచేసామని అన్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులే కాకుండా రాష్ట్రం నుంచి కూడా రూ.50 నుంచి రూ.1100 కోట్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. పీయూలో ఇప్పుడున్న కోర్సులే కాకుండా ఇంజనీరింగ్, లా, వృత్తి విద్యా కోర్సులు, అడ్వాన్స్‌డ్ కోర్సులను ప్రవేశపెట్టాలని పీయూ అధికారులను కోరారు. పాలమూరుకు సైనిక్ స్కూల్, స్కిల్‌డెవలప్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. విప్రో టీసీఎస్‌తో ఎంఓయూ కుదుర్చుకొని ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. అంతకు ముందు పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ యూనివర్సిటీకి కేంద్రం నుంచి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రూ.100 కోట్లు మంజూరు చేయడం ఆనందకర విషయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ధర్మేంద్రనాథ్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, నాయకులు డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కృషి చేశారని తెలిపారు. యూనివర్సిటీలో కేవలం 175 ఎకరాల భూమి మాత్రమే ఉందని, భవన నిర్మాణాలకు సరిపోవడంలేదని, మరో 25 ఎకరాలు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. పీయూకు ఎమ్మెల్యేగా మొదటి సారి వచ్చిన శ్రీనివాస్‌రెడ్డిని పీయూ అధికారులు ఘనంగా సన్మానించారు. పీయూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. పీయూలో లా, ఇంజనీరింగ్ కోర్సులను మంజూరు చేయాలని, రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీయూ వీసీ ఓఎస్‌డీ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, పీయూ పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య, ఎంఈడీ ప్రిన్సిపాల్ బషీర్ హమ్మద్ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని దోచుకున్నారు

- ఎన్నికల సన్నాహక సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు

గద్వాల/అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 19: రాష్ట్రాన్ని పదేళ్ల పాలించిన కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు దోచుకున్నారని, మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల అప్పులపాలు చేశారని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. సోమవారం ఆయన అలంపూర్ ఆలయాలను దర్శించుకున్నారు. అనంతరం అలంపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఎంపీ ఎన్నికల సన్నాహక సభలో ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కుచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మల్లు రవి, జడ్పీ చైర్‌పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మాజీ ఎంపీ మందా జగన్నాథ్, మాజీ మంత్రి చిన్నారెడ్డిలతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ ఇక్కడి మంత్రి ఇదే మండలంలోని కృష్ణానది తీర గ్రామలైన మారమునగాల, చందూరు గ్రామ శివార్లలో అక్రమంగా భుములు సంపాదించారన్నారు. కృష్ణా నదిని కూడా కబ్జా చేశారని ఆరోపించారు. వీరి అవినీతిని సహించలేకే ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టారని అన్నారు. అయిన సిగ్గులేకుండా రెండు నెలల పసికందు అయిన కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాలు సాధిస్తామని, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఎవరైన భారీ మెజారిటీ ఇవ్వాలని కోరారు.


గద్వాలలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

దుష్ప్రచారం వల్లే ఓడిపోయాను: సంపత్

అలంపూర్ నియోజకవర్గంలో చివరి పది రోజుల వరకు అన్ని సర్వేలు తనకే అనుకులంగా ఉన్నాయని, కానీ కింది స్థాయిలో కులం, మతం పేరుతో అందరూ ఒక్కటై ఓడించారని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆరోపించారు. నేడు గెలిపించినవారు, గెలిచినవారు ఎవరూ ప్రజల్లో లేరని, కానీ తాను మాత్రం ప్రజల్లోనే ఉన్నానని అన్నారు. తాను కూడా పొరపాట్లు చేసి ఉంటానని, క్షమించి వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మంత్రి అవుతాడనే సంపత్‌ను ఓడించారని, కానీ నాయకుడిగా ఈ సభతో గెలిచారని మల్లురవి అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీసమ్మ, జడ్పీటీసీ సభ్యులు సుగుణమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

సోనియా కుటుంబానికి అండగా ఉండాలి

'తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సమయంలో పిల్లలు పిట్టల్లా రాలిపోయింద్రు. తల్లుల కడుపుకోత తెలిసిన సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేశారు. ఆ కుటుంబమే దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసింది. అలాంటి కుటుంబానికి అండగా ఉండి, ఎంపీ సీట్లను అందిద్దాం' అని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం గద్వాలలో నిర్వహించిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ సరిత అధ్యక్షత వహించారు. మంత్రి జూపల్లి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్‌కు బంగారు పళ్లెంలో రాష్ట్రం అప్పగించామని అన్నారని, కానీ రూ.ఎనిమిది లక్షల కోట్ల అప్పు చేతికిచ్చారని చెప్పారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భూ స్థాపితం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి పరిపాలనలో రెండు నెలల్లోనే పాలన గాడిన పడి, ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టారని వివరించారు. రుణమాఫీకి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కట్టుబడి ఉన్నామన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో 50 వేల మెజారిటీతో అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, మాజీ ఎంపీ మందా జగన్నాథ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, నాయకులు రాజీవ్‌రెడ్డి, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

జయశంకర్ వర్సిటీ వీసీ పదవికి గట్టి పోటీ!

» 28 మంది దరఖాస్తు.. వడపోత తర్వాత ఎంపిక

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ పదవికి గట్టి పోటీ నెలకొంది. ఏకంగా 28 మంది దరఖాస్తు చేసినట్లు సమాచారం. వీసీ పోస్టు కోసం ఈ నెల రెండో తేదీన రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా దరఖాస్తులకు సోమవారంతో గడువు ముగిసింది. 28 మంది దరఖాస్తు చేసినా... ప్రధాన పోటీ నలుగురైదుగురి మధ్యే ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీలో పరిశోధన విభాగం డైరెక్టర్(డీఆర్)గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన ఆర్. జగదీశ్వర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. జగదీశ్వర్‌ది కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం. ఐదేళ్లు డీఆర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో వీసీ రేసులో ముందు వరుసలో ఉన్నారు. సీనియర్ ప్రొఫెసర్ ఎం.గోవర్ధన్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు నేతృత్వంలోని స్ర్కీనింగ్ కమిటీ దరఖాస్తులను పరిశీలించి.. ముగ్గురి పేర్లతో షార్ట్‌లిస్టు తయారుచేసి సీఎంకు పంపించనుంది. చివరిగా వీసీ నియామకాన్ని గవర్నర్ ఫైనల్ చేస్తారు. మొత్తం మీద వర్సిటీ వీసీ నియామకం పారదర్శకంగా నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.


ట్రైకార్ సబ్సిడీ స్వాహా!

(మొదటిపేజీ తరువాయి)

సుమారు రూ.130 కోట్ల నిధులు కేటాయించగా.. అందులో రూ.40 కోట్లకు పైగా సబ్సిడీ నిధులు స్వాహా అయినట్లు సమాచారం. ఈ పథకం కింద.. గిరిజన సహకార ఆర్థిక సంస్థ(ట్రైకార్) ద్వారా ఒక్కొక్క యూనిట్‌కు రూ.10 లక్షల నుంచి రూ.40లక్షల దాకా ఇస్తారు. యూనిట్ ఏర్పాటుకు అయ్యే మొత్తంలో 10 శాతాన్ని.. లబ్ధిదారులు తమ వాటా ధనంగా తొలుత ఏదైనా జాతీయ బ్యాంకులో జమచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన 30 శాతాన్ని బ్యాంకులు రుణం రూపంలో ఇస్తాయి. రుణానికి అర్హులైన వ్యక్తులు లేదా జేఎల్ గ్రూపులు సమీప జాతీయ బ్యాంకులో ఖాతా తెరిచి, తమ వాటా 10 శాతం అందులో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత రెండుమూడు దశల్లో బ్యాంకు.. సదరు యూనిట్‌కు సామగ్రి అందించే సంస్థల పేరు మీద మాత్రమే చెక్కులు అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వ రాయితీ 60 శాతం. ఇదీ పథకం స్వరూపం. దీని కింద.. తెలంగాణలోని ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ, భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటీడీఏ, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏల ద్వారా 2020-22లో సుమారు రూ.130కోట్లకు పైగా రుణాలు మంజూరు కాగా.. రూ.62 కోట్ల సబ్సిడీ నిధులు విడుదల చేసినట్లు సమాచారం.

పక్కదారి ఇలా..

నిబంధనల ప్రకారం.. బ్యాంకులు గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఐటీడీఏ పీవోల ప్రత్యేక ఖాతాలకు సబ్సిడీ మొత్తాన్ని జమ చేస్తాయి. ఐటీడీఏ పీవోలు.. ఎంపికైన లబ్ధిదారుల ఖాతాకు సబ్సిడీని జమ చేయాలి. కానీ, బ్యాంకు ఇచ్చే 30శాతం రుణంతో సంబంధం లేకుండా కేవలం సబ్సిడీ డబ్బులతో యూనిట్లకు కావాల్సిన సామగ్రిని లబ్ధిదారులకు ఐటీడీఏ అధికారులే అంటగడుతున్నారు. చాలా చోట్ల పాత సామగ్రిని ఇచ్చి, లబ్ధిదారులతో సంతకాలు చేయించుకుని వెళ్తున్నారు. సరైన సామగ్రి లేక తర్వాత ఆ యూనిట్లు మూలనపడుతున్నాయి. ఉదాహరణకు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని కొత్తగూడలో శ్రీముసలమ్మ ట్రైబల్ జేఎల్ గ్రూపునకు దాల్ మిల్ యూనిట్ కోసం రూ.40లక్షలు మంజూరయ్యాయి. స్థానిక ఇండియన్ బ్యాంకులో ఖాతా తెరిచి తమ వాటాధనం 10 శాతం (రూ.4 లక్షలు) జమ చేశారు. నిబంధనల ప్రకారం దాల్ మిల్ యంత్రాల కొనుగోలు డబ్బులను బ్యాంకు ద్వారా చెల్లించాలి. కానీ, ఆ యంత్రాలను ఓ మధ్యవర్తి ద్వారా ఐటీడీఏ అధికారులే కొనుగోలు చేసి తూతూమంత్రంగా మిల్లును ఏర్పాటు చేశారు. సుమారు రూ.8 లక్షల వరకూ ఖర్చు చేసినట్టు లెక్కలు చూపారు. ట్రయల్ రన్ పేరుతో ఆ యూనిట్‌ను మూడు రోజులు నడిపించిన సభ్యులు.. ముడి సరుకులు లేకపోవటంతో పాటు ఇంకా రావాల్సిన ఇతర యంత్రాలు లేక మిల్లును మూసేశారు. నాలుగేళ్లుగా ఆ దాల్ మిల్ నడవటం లేదు. మిగతా సబ్సిడీ సొమ్ము ఏమైందో ఎవరికీ తెలియదు. కాగా, గ్రూపు వాటాధనంగా బ్యాంకులో ఉన్న రూ.4 లక్షల్లో రూ.2.50 లక్షలు యూనిట్ కోసం ఇచ్చిన బంగ్లా మరమ్మతుల కోసమని కాంట్రాక్టర్ రంజిత్‌కు ఐటీడీఏ ఏపీవో ఆదేశాలతో ఇచ్చినట్లు గ్రూపు సభ్యులు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఇప్పటి వరకు ఆ డబ్బులు తిరిగివ్వలేదు. అలాగే.. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని పాల్వంచ మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన గిరిజనులకు శ్రీరాయకపోడు ట్రైబల్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఎంఎస్ఎంఈ గ్రూపునకు కళాకృతుల తయారీ కోసం రూ.32.15 లక్షల రుణం మంజూరైంది. ఈ గ్రూపునకు సంబంధించిన 10శాతం వాటా ధనాన్ని (రూ.3.22 లక్షలు) బ్యాంకులో కాకుండా.. ఫోన్‌పే ద్వారా ఒక అధికారి తన వ్యక్తిగత ఖాతాలో జమ చేయించుకున్నారు. భద్రాచలంలోని పాత ఎన్ఆర్‌సీ భవనంలో యూనిట్ ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఐటీడీఏ అధికారులు ఈ యూనిట్ ఖాతాలో రెండు విడతల్లో రూ.5.50లక్షలు జమ చేశారు. అందులో నుంచి భవన మరమ్మతులు, సున్నం కోసమని రూ.4.50లక్షలు వాడేసుకున్నారు. ఆ కాంట్రాక్టును కూడా.. సదరు అధికారి తన దగ్గరి బంధువుకే సమర్పించేసుకున్నారు. రూ.1.50లక్షలతో కొంత సామగ్రి తీసుకొచ్చి ఆ భవనంలో ఉంచారు. ఈ యూనిట్‌కు రావాల్సిన సబ్సిడీ రూ.19.29 లక్షలు. అయితే కేవలం రూ.6 లక్షలే లెక్క చూపిస్తున్నారు. మిగతా రూ.13.29లక్షల సబ్సిడీ ఎవరి ఖాతాలోకి వెళ్లిందనేది చర్చనీయాంశంగా మారింది. బ్యాంకుతో సంబంధం లేకుండా సబ్సిడీ నిధులను వాడటం నిబంధనలకు విరుద్ధం. శాఖ అంతర్గత ఆడిట్‌లో ఈ విషయం వెలుగులోకి వచ్చినా పై అధికారుల దృష్టికి వెళ్లకుండా ఐటీడీఏ స్థాయిలోనే 'మేనేజ్' చేశారనే ప్రచారం జరుగుతోంది. ఇందులో ఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. ప్రస్తుతం ఆ కళాకృతుల తయారీ కేంద్రం కళతప్పింది.


Canara Bank | DDMMYYYY 05012024
Pay AISHWARYA STEELTRADERS or Bearer
Rupees Twenty Five Lakhs Five Thousand Eighty Eight Rupees only ₹ 25,05,088/-
A/c No. 110110422873
386601
"Payable at par at all our branches in India"
Project Officer ITDA: Eturnagaram
SRI SAMMAKKA JLG
⑈386601⑈ 506015010⑆ 000746⑈ 31

ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశాల జేఎల్ గ్రూపు చెక్‌పై ఏటురునాగారం ఐటీడీఏ పీవో సంతకం

మూడో ఉదాహరణ..

మహబూబాబాద్ జిల్లా గార్లలో శ్రీసారలమ్మ జేఎల్ గ్రూపునకు సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రానికి రూ.25లక్షల రుణం మంజూరైంది. గార్లలోని ఎస్‌బీఐలో ఖాతా తెరిచి తమ వాటాధనం రూ.2.50 లక్షలు జమచేశారు. ఇక్కడ బ్యాంకు లోన్ రూ.7.50 లక్షలతో సంబంధం లేకుండానే డీఆర్‌డీఏలో పని చేసే ఓ అధికారి ఐటీడీఏ అధికారులతో కలిసి యూనిట్ ప్రారంభిస్తున్నామని చెప్పి, రూ.5లక్షల సబ్సిడీని బ్యాంకు ఖాతాలో జమ చేయించారు. ఇందులో నుంచి రూ.3లక్షలు పి.శ్రీనివాస్ అనే వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. మిగతా రూ.2లక్షలు జేఎల్ గ్రూపు డ్రా చేసుకున్నట్టుగా బ్యాంకు రికార్డులున్నాయి. ఈ పథకం కింద ఖాతా తెరిచిన తరువాత యూనిట్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసిన కంపెనీకే పేమెంట్లు చేయాలి. వ్యక్తిగతంగా వాడుకోవడానికి వీలులేదు. అయితే పి.శ్రీనివాస్ ఎవరు.. ఆయనకు ఎందుకు జమ చేశారనేది చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసమని రూ.3.80లక్షలు ఎన్‌పీడీసీఎల్‌కు డీడీ రూపంలో చెల్లించారు. బ్రిక్స్ యూనిట్ కోసం ప్రత్యేకంగా ఇంత పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకనేది సమాధానం లేని ప్రశ్న. బయ్యారంలో కూడా సిమెంట్ ఇటుకల యూనిట్‌లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అశ్వారావుపేట, దమ్మపేటలో కొండరెడ్లకు మంజూరైన యూనిట్లు, భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లోని కోయలకు మంజూరైన యూనిట్లలో సబ్సిడీ వారికి తెలియకుండా గిరిజన సంక్షేమశాఖ అధికారులు స్వాహా చేసినట్టు సమాచారం. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశల, లింగాల, ములుగు మండలం జంగాలపల్లి, కొత్తగూడ మండలం దొరవారి వేంపల్లి, పొగులపల్లి గ్రామాల్లోని జేఎల్ గ్రూపులకు మంజూరైన నిధులూ దారి తప్పినట్టు తెలుస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో రూ.40కోట్లకు పైగా సబ్సిడీ నిధులు ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు పక్కదారి పట్టించారని సమాచారం.

పీవోలకు చెక్ పవర్!

ప్రభుత్వ పథకాల కోసం ఏర్పాటు చేసుకునే లబ్ధిదారుల గ్రూపులో అధ్యక్ష, కార్యదర్శులకు చెక్‌పవర్ ఉంటుంది. ఆ ఇద్దరి పేరిటే బ్యాంకులో ఖాతా తెరుస్తారు. అయితే ఈ పథకంలో మాత్రం ఐటీడీఏ పీవోలు కూడా తమ పవర్ చూపిస్తున్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీవో.. లబ్ధిదారులతో పాటు తనకు కూడా చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు రాయడమే కాకుండా, చెక్కులపై సంతకాలు చేసేస్తున్నారు. దీంతో ఇతర ఐటీడీఏ పీవోలకు కూడా ఆశ పుట్టి జేఎల్ గ్రూపుల్లో తమకు కూడా జాయింట్ చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు వ్రాసి సాధించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.2.50లక్షలు తీసుకున్నరు



మేం పెట్టిన దాల్ మిల్ నాలుగేళ్లుగా మూత పడింది. బ్యాంకు నుంచి లోన్ ఇవ్వలేదు. సబ్సిడీ కూడా రాలేదు. మిషన్లు ఐటీడీఏ వాళ్లే ఇచ్చిండ్లు. మూడు రోజులు ట్రయల్ నడిపినం. ముడిసరుకు లేకపోవటంతో బంద్ జేసినం. మా వాటా కింద బ్యాంకుల జమ చేసిన రూ.5 లక్షల నుంచి కాంట్రాక్టర్ రంజిత్‌కు రూ.2.50 లక్షలు ఇచ్చినం. ఐటీడీఏ ఏపీవోతోపాటు మరో ఇద్దరు అధికారులు కాంట్రాక్టర్‌కు ఆ పైసలు ఇవ్వాలని చెప్పారు. మిల్ నడిపే రూమ్‌ను ఏదో రిపేర్ చేస్తామని తీసుకున్నారు. మళ్లీ ఇస్తామని చెప్పి నాలుగేళ్లవుతున్నా మా డబ్బులు ఇవ్వలేదు. సబ్సిడీ రావటం లేదు. దాల్ మిల్ నడవటం లేదు. మేం అన్ని రకాలుగా నష్టపోయాం.

- భూపతి శ్యామల,
కొత్తగూడ, జేఎల్ గ్రూపు అధ్యక్షురాలు

చక్రం తిప్పింది ఆయనే!

గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలోని ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగే ఈ మొత్తం దందాలో కీలక పాత్ర పోషించారని సమాచారం. ఆ 'లక్ష్మీ'పుత్రుడు తనకు తానే రాష్ట్రంలో ఈ మిషన్ మేనేజర్‌గా చెప్పుకొంటూ సబ్సిడీ నిధులను అవినీతి అధికారులకు 'ప్రసాదం'లా పంచారనే చర్చ గిరిజన శాఖలో జరుగుతోంది. శాఖలోని ప్రధాన అధికారుల నుంచి ఐటీడీఏలోని కింది స్థాయి అధికారి వరకూ అందరినీ ఆయన వాటాలతో మేనేజ్ చేస్తున్నట్టు సమాచారం. గత ప్రభుత్వ హయంలో గిరిజనశాఖ మంత్రి సమీప బంధువు కూడా ఒకరు ఈ సబ్సిడీ స్వాహాపర్వంలో కీలకంగా ఉన్నట్లుగా సమాచారం. ఈ అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ జరిపించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ
హరికృష్ణ సస్పెన్షన్ ఉత్తర్వులు కొట్టివేత

» సస్పెన్షన్‌పై హైకోర్టుకు వెళ్లిన మాజీ ఓఎస్డీ
» కాంపిటెంట్ అథారిటీ జారీ చేయలేదంటూ సస్పెన్షన్ ఉత్తర్వుల కొట్టివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌కు గురైన హకీంపేట స్పోర్ట్స్ పాఠశాల మాజీ ఓఎస్డీ టి.హరికృష్ణకు హైకోర్టులో ఊరట లభించింది. కాంపిటెంట్ అథారిటీ మాత్రమే జారీ చేయాలంటూ ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులను ధర్మాసనం కొట్టివేసింది. హరికృష్ణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను విధుల్లోంచి తొలగిస్తూ అప్పటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ అండ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి ఫిర్యాదు, విచారణ లేకుండా సస్పెండ్ చేయడం చెల్లదని, ఆధారాలు లేకపోయినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని యువజన వ్యవహారాలు, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారని, ఈ ఉత్తర్వులు చెల్లవని హరికృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ పశు సంవర్ధక శాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా నియమితులయ్యారని, 2020లో హకీంపేట స్పోర్ట్స్ పాఠశాలకు ఓఎస్డీగా డిప్యూటేషన్‌పై వెళ్లారని ఆయన తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు, కారణాలు లేకుండా, అధికార పరిధికి విరుద్ధంగా కేవలం ఆరోపణలు వచ్చాయని పేర్కొంటూ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పిటిషనర్ డిప్యూటేషన్‌పై క్రీడా శాఖకు వెళ్లారని, సరైన కారణాలు, విషయ తీవ్రత ఉన్నా కాంపిటెంట్ అథారిటీ మాత్రమే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయగలరని వ్యాఖ్యానించింది. ఈ కేసులో పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి అపాయింటింగ్ అథారిటీ అని.. ఇప్పటి వరకు ఎలాంటి చార్జి మెమో జారీ చేయలేదని గుర్తు చేసింది. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఉన్నందున సదరు సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టి వేస్తున్నట్లు తుది తీర్పు జారీ చేసింది.

కుట్ర చేసి, ఇరికించి సస్పెండ్ చేశారు

» కవిత, శ్రీనివాస్ గౌడ్ స్వార్థానికి నన్ను బలి చేశారు
» మాజీ సీఎం పేషీలోని భూపాల్‌రెడ్డికి మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదని నాపై కుట్ర
» హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ హరికృష్ణ ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గలేదన్న కారణంగానే తనను కుట్రపూరితంగా ఇరికించి.. సస్పెండ్ చేశారని హకీంపేట క్రీడా పాఠశాల మాజీ ఓఎస్డీ హరికృష్ణ తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలను తెలుసుకోకుండా అహంకారంతో ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారని, పైవారి మనన్నల కోసం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తనను బలి చేశారని ఆరోపించారు. గత ఏడాది హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన ఒక ఘటనకు సంబంధించి తనపై నమోదైన కేసు విషయంలో ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిందని పేర్కొంటూ సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీట్ల కేటాయింపు విషయంలో గతంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ఉన్న ఆంజనేయగౌడ్, ఆయన పీఏ (రిటైర్డ్) నర్సయ్య, శాట్స్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తనను ఒత్తిడికి గురి చేశారని, అప్పటి సీఎం కేసీఆర్ పేషీలోని భూపాల్‌రెడ్డికి రోజూ మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదన్న కారణంగా అందరూ కలిసి తనను బలి పశువును చేశారని తెలిపారు. తనను సస్పెండ్ చేసిన రోజే ఆ స్థానంలో వెలమ సామాజిక వర్గానికి చెందిన ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించారని, నిజానికి అది రాష్ట్రస్థాయి పోస్టు అని, దానిలో కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించకూడదన్న నిబంధనలు ఉన్నాయని వివరించారు. అయినా వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. విచారణ సమయంలో అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ, శాట్స్ మేనేజర్‌లకు అడ్మినిస్ట్రేటివ్ స్వేచ్ఛను ఇచ్చి ఉంటే వారు సమగ్రమైన విచారణ జరిపే వారని, తద్వారా తనకు న్యాయం జరిగేదని తెలిపారు. గత ప్రభుత్వంలో పైవాళ్లు ఏది చెబితే దానినే వేదం అన్నట్టుగా వ్యవహరించేవారని ఆరోపించారు. తనపై ఆరోపణ వచ్చిన రోజు ఉదయం 9 గంటలకే ప్రెస్‌మీట్ పెట్టి మరీ తనను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవరిపైన అయినా ఫిర్యాదు కానీ అనుమానం కానీ వస్తే ముందు చర్యలు తీసుకుని, ఆ తరువాత విచారణ చేస్తామని గత ప్రభుత్వం చెప్పిందని, అదే సరైన విధానమైతే.. ఇప్పుడు ఎవరైనా తప్పులు చేసినట్టు ప్రభుత్వం దృష్టికి వస్తే ముందుగా చర్యలు తీసుకుని, ఆ తర్వాత విచారణ చేయించాలని సీఎం రేవంత్‌ను కోరారు. తన కుటుంబ గౌరవ మర్యాదలను నాశనం చేసిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

కాళేశ్వరం ఒప్పందాలు బయటపెట్టాలన్న పిటిషనర్‌కు హైకోర్టు అక్షింతలు

» చట్టం, ప్రజా ప్రయోజన వ్యాజ్యం రూల్స్ చదువుకొని రావాలని చురకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్ని ఒప్పందాలు జరిగాయో వాటన్నిటినీ బయటపెట్టడంతోపాటు పూర్తి వివరాలను కోర్టు ఎదుట ఉంచాలంటూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు మీకు పిల్ రూల్స్ తెలుసా!? అని మండిపడింది. గత ఏడాది నవంబర్ 16న సికింద్రాబాద్‌కు చెందిన మధుగంటి విశ్వనాథ్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నందిత గుహ వాదనలు వినిపించడానికి సిద్ధమవగా ధర్మాసనం జోక్యం చేసుకుంది. "పిటిషనర్‌ను సీనియర్ న్యాయవాది అని పేర్కొన్నారు. హైకోర్టు గుర్తించకుండా సీనియర్ న్యాయవాది అని ఎలా సంబోధిస్తారు? చట్టం, ప్రొసీజర్ తెలియకుండానే ఇక్కడికి వచ్చారా? ఇలాంటి పిటిషన్లు ఎందుకు వేస్తారో తెలుసు. ఆ తర్వాత ఎక్కడెక్కడ చర్చలు జరుపుతారో తెలుసు. హైకోర్టు లైబ్రరీలో కూర్చొని పిల్ రూల్స్ చట్టం చదువుకోండి. ఆ తర్వాత ఈ అంశాలపై పిల్ వేయవచ్చా? లేదా? అనేది మీకే అర్థమవుతుంది. పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ అంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు" అంటూ తలంటింది. పిటిషన్లో మార్పులు చేసి రావాలంటూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

గ్రామసభ కోరం రూల్స్ సవరణపై పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామసభ నిర్వహణకు ఉండాల్సిన 'కోరం' నిబంధనలు సవరిస్తూ జారీ చేసిన జీవో 54 చెల్లదని పేర్కొంటూ ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. లంబాడా హక్కుల పోరాట సమితి నాయకుడు దేవానాయక్ దీనిని దాఖలు చేశారు. గ్రామసభ నిర్వహణకు మూడో వంతు హాజరైతేనే కోరం ఉన్నట్లని, అందులో సగం ఎస్టీలు ఉండాలనే నిబంధనలను సవరించారని, ఇది పెసా చట్టంతోపాటు గిరిజన ప్రాంతాల్లోని ప్రజల హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ.. బీజేపీతో పొత్తు పెట్టుకోదు: బాల్క సుమన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, తమ పార్టీ అధినేత కేసీఆర్ సెక్యులర్ నాయకుడని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తమ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని తాము ఎక్కడా చెప్పలేదని, ఎవరినీ అడగలేదన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర నాయకులు బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదనడం తగదని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు మీడియాకు లీక్ లిస్తున్నారని, పత్రికల్లో రాయిస్తున్నారని అన్నారు. 15 రోజుల్లో నలుగురు గురుకుల విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని, దీన్ని పట్టించుకోకుండా రాష్ట్రంలో సమస్యలే లేనట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని, కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బు సంచులు మోస్తున్నారని ఆరోపించారు.

వైటీపీపీ వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నేడు

నల్లగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో తెలంగాణ సర్కారు నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీపీ) వద్ద మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఇందులో ప్రజల నుంచి సానుకూలత వస్తేనే ప్లాంట్‌కు కేంద్ర పర్యావరణ శాఖ అన్ని అనుమతులు జారీ చేస్తుందని, అప్పుడే ప్లాంట్ నుంచి అధికారికంగా విద్యుదుత్పత్తికి మార్గం సుగమమవుతుందని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఇళ్లు కోల్పోయిన గిరిజనులకు వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కొంతమందికి పరిహారాలు అందలేదని, వాటన్నింటినిపై తేల్చాలని నిలదీసేందుకు భూ నిర్వాసితులు సిద్ధమవుతున్నారు.

825 శాతం పెరిగిన ఆక్సిజన్ బెడ్స్

» దేశవ్యాప్తంగా సర్కారు ఆస్పత్రుల్లో ప్రస్తుతం 5.15 లక్షల బెడ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్ల సంఖ్య 825 శాతం పెరిగినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 5,15,345 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు తెలిపింది. అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ పడకల వివరాలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. ఈ పడకలన్నీ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. 2020 ఏప్రిల్ నాటికి మన దేశంలో కేవలం 62,458 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. ప్రస్తుతం దేశంలో అత్యధికంగా 1,32,314 ఆక్సిజన్ బెడ్స్ మహారాష్ట్రలో ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ఆ రాష్ట్రంలో 11,254 ఆక్సిజన్ బెడ్స్ ఉండేవి. 61,074 ఆక్సిజన్ బెడ్స్‌తో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్(42,221), గుజరాత్(40,708), పశ్చిమబెంగాల్(28,267), కర్ణాటక(27,707) రాజస్థాన్(20,116) నిలిచాయి. తెలంగాణలో 2020ఏప్రిల్ నాటికి సర్కారీ దవాఖానాల్లో 181 ఆక్సిజన్ పడకలుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 13,664కు పెరిగినట్లు కేంద్రం పేర్కొంది. కాగా, దేశవ్యాప్తంగా ఉన్న ఆక్సిజన్ పడకల్లో 25.86 శాతం దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో 1,33,289 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది.

టీఎస్ పీఈసెట్ షెడ్యూల్ విడుదల

టీఎస్-పీఈసెట్- 2024 షెడ్యూల్‌ను శాత వాహన విశ్వవిద్యాలయం కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు గాను మార్చి 14 నుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆలస్యరుసుంతో మే 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

ఖమ్మంలో చట్టవిరుద్ధంగా పోలీసుల ప్రవర్తన

» సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రధాన కార్యదర్శి

ఖమ్మం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పోలీసులు గ్రామాల్లో చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలను భయోత్పాతానికి గురి చేస్తున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య ఆరోపించారు. తమ పార్టీ కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యుడు గోపన్న, సభ్యులు ఎస్‌కే మదార్, కే సురేష్‌ను ఫిబ్రవరి 14న అదుపులోకి తీసుకున్న పోలీసులు అక్రమంగా నిర్బంధించి ఫిబ్రవరి 16న మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని, వీరితోపాటు మరో 24 మందిపై సెక్షన్124-బి కింద కుట్ర కేసులు పెట్టారని విమర్శించారు. సీఎం జోక్యం చేసుకుని పోలీసు శాఖపై సమీక్ష చేయాలని కోరారు.

పోలీస్ శిక్షణకు కానిస్టేబుళ్లు సిద్ధం

- ఎంపికైన 179 మందిలో రిపోర్ట్‌చేసింది 163 మంది

- వారికి కిట్స్ అందజేసిన ఎస్పీ హర్షవర్ధన్


కానిస్టేబుళ్ళకు కిట్ అందజేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19 : ఇటీవల నియామక పత్రాలు అందుకున్న కానిస్టేబుళ్లు పోలీస్‌శిక్షణకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగానే సోమవారం జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా నుంచి ఎంపికైన 179 మంది కానిస్టేబుళ్లలో 163 మంది రిపోర్ట్ చేశారు. ఎస్పీ హర్షవర్ధన్ వారికి కిట్ ఆర్టికల్‌ని అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్‌శిక్షణ నియమ నిబంధనలు వారికి ఎస్పీ తెలియజేశారు. వివిధ పోలీస్‌శిక్షణ సంస్థలలో ఈనెల 21నుంచి 9 నెలలపాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలాన్ని క్రమశిక్షణతో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ సురేశ్‌కుమార్ డీఎస్పీ ఏఆర్ శ్రీనివాస్, ఏఓ రుక్మిణిబాయి తదితరులు పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

- సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్

అడ్డాకుల, ఫిబ్రవరి 19 : మండల పరిధిలోని పొన్నకల్, మూసాపేట మండలం కొంరెడ్డి పల్లి, మూసాపేట, నిజాలాపూర్, జానంపేట, వేముల, దాసరిపల్లి గ్రామాల్లో సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు సీసీ రోడ్లను సకాలంలో నాణ్యతంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా మూసాపేటలో ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఫేర్‌ను సందర్శించి విద్యార్థులను అభినందించి సైకిళ్లను అందజేశారు. ఉమ్మడి అడ్డాకుల మండలం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో కుంటుపడిన అభివృద్ధి

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి


ఎంపీడీవో కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్, ఫిబ్రవరి 19 : బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిందని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు అందజేశారు. మహిళా సమాఖ్య ద్వారా ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కొత్తూరు గ్రామం నుండి వెలుగొమ్ముల, అయ్యవారిపల్లి, చిలువేరు, రెడ్డిగూడమీదుగా కల్వకుర్తి- జడ్చర్ల ప్రధానరహదారి వరకు డబుల్‌రోడ్డు మంజూరైందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏలు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బరిగెల సుదర్శన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, ఎంపీటీసీ గౌస్, తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీవో గీతాంజలి, ఎంపీవో అనురాధ, నాయకులు సాయులు, జహీర్, ఉస్మాన్, ప్రదీప్‌రెడ్డి, అశోక్, పర్వతాలు, శంకర్‌నాయక్, మల్లికార్జున్‌రెడ్డి జంగయ్య, బాలు, శివ, కృష్ణయ్యగౌడ్ ఉన్నారు.

చెక్ డ్యాంక్ నిర్మాణానికి భూమి పూజ

బాలానగర్ : మండలంలోని కేతిరెడ్డిపల్లి, సూరారం గ్రామాలలోని వాగుపై నిర్మాణం చేపడుతున్న రెండు చెక్ డ్యాంలకు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి భూమిపూజ చేశారు. అలాగే మోతిమనపూర్, కేతిరెడ్డిపల్లి గ్రామాలలో గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ జయంతిలో పాల్గొని కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రఫీక్, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శంకర్‌నాయక్, హరిసింగ్, రఘుయాదవ్, బుజ్జానాయక్, రఘుగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిపథ్ ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయడం లేదు ?

- టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19 : ప్రధాని నరేంద్రమోదీ రెండోసారి అధికారంలోకి వచిన నాలుగేళ్లలో త్రివిధ దళాలలో సైనికుల నియామకాలు చేపట్టలేదని, దీనివల్ల 1.55 లక్షల నుంచి 1.66 లక్షల ఖాళీలు ఏర్పడ్డాయని టీపీసీసీ అధికారప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి విమర్శించారు. ఇందుకు కోవిడ్ కారణంగా చెప్పిన ఆయన, ఆ తర్వాత 22-23లో కోవిడ్ లేదని, ఎందుకు ఉద్యోగాలు భర్తీచేయలేదని ప్రశ్నించారు. అగ్నిపథ్ కింద చేరిన సైనికులకు ఆరు నెలల కాలమే శిక్షణ ఇస్తున్నారని, ఈ శిక్షణ కాలం ఏమాత్రం సరిపోదన్నారు. వెంటనే త్రివిధ దళాలలో ఖాళీగా ఉన్న సైనికులను వెంటనే భర్తీచేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలనలో మహబూబ్‌నగర్ జిల్లాలో 2014నుంచి ఇప్పటివరకు కేంద్రం ఎన్ని ఉద్యోగాలిచ్చింది ? ఎన్ని ఊడబీకిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైల్వేరంగం, బీఎస్ఎన్ ఎల్‌ను ప్రైవేట్ చేశారని, పోస్టాఫీసులో 18 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కేంద్రీయ విద్యాలయంలో 42 మందికి ముగ్గురే పనిచేస్తున్నారని, దీనిపై బీజేపీ నాయకులు సమాధానం చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్ పాల్గొన్నారు.

అడ్డాకుల జూనియర్ కళాశాల తనిఖీ

అడ్డాకుల, ఫిబ్రవరి 19 : స్థానిక ఇంటర్మీడియట్ కళాశాలను సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా ఇంటర్ మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) శ్రీధర్ సుమన్ తనిఖీ చేశారు. పర్యావరణ విద్య పరీక్ష సందర్భంగా ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. అదేవిధంగా అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు సూచనలు, సలహాలు చెప్పారు. అనంతరం డీఐఓఈను అధ్యాపకులు సన్మానించారు. ప్రిన్సిపాల్ అంజన్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'కల్వరికొండ భూములపై విచారణ చేయించాలి'

పాలమూరు, ఫిబ్రవరి 19 : పట్టణంలోని కల్వరికొండ సర్వేనెంబర్ 227లోని భూములపై విచారణ చేసి పేదలకు న్యాయం చేయాలని పాలమూరు లేబర్ సంఘం నాయకులు గడ్డమీది గోపాలకృష్ణ కోరారు. సోమవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్‌కు ఫిర్యాదు చేశారు. న్యూమోతినగర్ నుంచి కల్వరికొండ పరిసర ప్రాంతంలో పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామని చెప్పి లక్షల్లో డబ్బు వసూలు చేశారని, నెలలు గడుస్తున్నా స్పందన లేకపోవటంతో ప్రస్తుతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భూపతి వెంకట్, లింగంపేట సుమన్ పాల్గొన్నారు.

'మండల కేంద్రాల్లో బస్టాండ్‌లు నిర్మించాలి'

పాలమూరు, ఫిబ్రవరి 19 : 44వ జాతీయ రహదారి వెంట ఉన్న మండల కేంద్రాల్లో తక్షణమే బస్టాండ్‌లను నిర్మించాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా సమన్వయ కర్త పి.బుచ్చారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. భూత్‌పూర్, అడ్డాకుల లాంటి మండల కేంద్రాల్లో బస్టాండ్‌లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

22న మునిసిపల్ బడ్జెట్ సమావేశం

మహబబూబ్‌నగర్, ఫిబ్రవరి 19 : ఈనెల 22న పాలమూరు పురపాలిక బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఇందుకు సంబందించిన అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. బడ్జెట్‌కు సంబంధించిన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రజలకు ఉపయోగపడేలా మంచి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పవన్‌కుమార్, మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీ బస్వరాజు, అధికారులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలు చేయాలి : అడిషనల్ కలెక్టర్

మునిసిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్ను, కొళాయి పన్నులను వందశాతం వసూలు చేయాలని అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. మార్చి నెలాఖరుకల్లా వందశాతం పన్నుల వసూలుపై అధికారులు దృష్టిసారించాలన్నారు. మొండిబకాయిదారులకు నోటీసులు జారీచేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ పవన్‌కుమార్, ఎంఈ బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో మశ్చేందర్‌కు ఘన సన్మానం

రాజాపూర్, ఫిబ్రవరి 19 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో మశ్చేందర్‌ను ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాలతో ఘనంగా స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరహరి, గోవర్ధన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గోనెల రమేష్, రమణ, బుగ్గయ్య, శ్యామ్‌సుందర్‌రెడ్డి, నర్సింములు, నసీర్‌బైగ్, నాయకులు పాల్గొన్నారు.


శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి


శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

స్ఫూర్తిప్రదాత.. ఛత్రపతి శివాజీ

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- జయంతి సందర్భంగా ఘన నివాళి

మహబూబ్‌నగర్/ పాలమూరు/ హన్వాడ/ అడ్డాకుల/ దేవరకద్ర/ నవాబ్‌పేట/ మిడ్జిల్/ చిన్నచింతకుంట/ బాలానగర్/ జడ్చర్ల/ రాజాపూర్/ గండీడ్, ఫిబ్రవరి 19 : ఛత్రపతి శివాజీ స్ఫూర్తిప్రధాత అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శివాజీ జయంతి సందర్భంగా బండమీదిపల్లిలోని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం పట్టణంలోని శివాజీ మహరాజ్ చిత్రపటం ఊరేగింపు మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన్య కుటుంబంలో జన్మించిన ఆయన తల్లికి ఇచ్చిన మాటకోసం మహాచక్రవర్తిగా ఎదిగి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారన్నారు. వచ్చే ఏడాది శివాఈ జయంతి నాటికి కాంస్య విగ్రహం ఏర్పాటు చేసుకుం దామని


కూచూర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కౌన్సిలర్ లక్ష్మీదేవి, వీహెచ్‌పీ అధ్యక్షుడు చంద్రయ్య, మద్ది యాదిరెడ్డి, వసంత వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు. ● శివాజీ జయంతి పురస్కరించుకొని పాలకొండ-బైపాస్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని మాజీమంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ● జ్ఞాన నీలి మెరుపు బహుజన మహనీయుల శోభాయాత్ర నాయకుల ఆధ్వర్యంలో పాత పాలమూరులో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, డి.బాలన్న, బుద్దిస్టు సొసైటీ జిల్లా కార్యదర్శి మల్లెపోగు ప్రవీణ్‌కుమార్‌లు ప్రసంగించారు. ● శివాజీ జయంతి సందర్భంగా హన్వాడ మండలం వేపూర్ గ్రామంలో యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని బీజేపీ నాయకుడు ఏపీ మిథున్‌రెడ్డి ప్రారంభించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మధు మాట్లాడారు. హన్వాడలో ఆరెకటిక సంఘం, పెద్దదర్‌పల్లిలో బీజేపీ నాయకుడు రఘురాంగౌడ్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి నిర్వహించారు. ● అడ్డాకుల మండలం రాచాలలో కోట బురుజు దగ్గర ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ● దేవరకద్ర : మండల పరిధిలోని గోపన్‌పల్లి గ్రామంలో నూతనంగా ఏర్పా టు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహం ప్రారంభంలో ఎమ్మెల్యే జీ మధు సూదన్ రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. దేవరకద్రలో వివిధ పార్టీల నాయకులు, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కుడు కొండ గోవర్ధన్‌రెడ్డి ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా దేవరదక్రలో ప్రభుత్వ బాలుర, బాలికల ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేశారు. ●


ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణలో డీకే అరుణ తదితరులు

నవాబ్‌పేట మండ లంలోని కూచూర్ గ్రామంలో శివాజీ చిత్ర పటానికి నివాళ్లు అర్పించారు. యన్మనగండ్లలో మాజీ ఉపసర్పంచ్ రఘు ఆధ్వర్యంలో నివాళ్లు అర్పిం చారు. సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో చిగుళ్లపల్లి నర్సింహులు ఆధ్వర్యంలో ఫోరం సభ్యులు జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఆయా గ్రామాల యువకులు పాల్గొన్నారు. ● మిడ్జిల్‌లో హిందూ వాహిని ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు వడ్డె బాలు, సౌట రమేష్‌గౌడ్, పల్లె అరవింద్, పడకల్ అంజి, వడ్డె నవీన్, వెంకట్, వెంకటేష్, మల్లేష్ ఉన్నారు. ● బాలానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భానుప్రకాష్ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. కాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ● జడ్చర్ల : జడ్చర్ల మునిసిపాలిటీలోని పాతబజారు హనుమాన్ దేవాలయ చౌరస్తా ప్రాంగణంలో ఉన్న శివాజీ విగ్రహానికి మునిసిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మీ, కౌన్సిలర్‌లు, శివాజీ యువజన సంఘం సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ● రాజాపూర్‌లో ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు.

పంట పొలాలను కాపాడాలి

- కలెక్టర్‌ను కోరిన బాధిత రైతులు



ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదులు సమర్పిస్తున్న ప్రజలు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఫిబ్రవరి 18 : 'బోయపల్లి శివారు టంకర రోడ్డు మార్గంలో మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన గుబ్బ కిషోర్ కుమార్ వేరుశనగ ఆయిల్ మిల్లు ఉంది. మిల్లు చుట్టూ ఉన్న పంటపొలాల్లో దుమ్ము చేరి అస్వస్థతకు గురవువతున్నాం. మమ్ములను, మా ఆరోగ్యాన్ని, పంట పొలాలను కాపాడాలి' అని సంబంధిత రైతులు శ్రీశైలం, బడిగె యాదయ్య, వడెన్న, బి. శ్రీనివాసులు, జి. వెంకటేశ్, బి. రవి, జి. భగవాన్ తదితరలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం ఐడీవోసీలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ జి. రవినాయక్, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్.మోహన్‌రావు, జిల్లా అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయిల్ మిల్లుపై ఫిర్యాదు చేసిన రైతులు మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ పొలాల్లోనే పనిచేసుకుంటామని, మిల్లు నుంచి వెలువడే పొగ, దుమ్ముతో చర్మవ్యాదులు వస్తున్నాయని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు సిబ్బందిని సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ జి. రవినాయక్ వివరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని సిద్ధం చేస్తున్నామని, అలాగే తుది జాబితా తర్వాత వచ్చిన ఫామ్ 6,7,8 లు పరిశీలన చేస్తున్నామని తెలిపారు. అంతకు ముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ ఎపిక్ కార్డుల పంపిణీ, ఎన్నికల సిబ్బందికి శిక్షణ, ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రసాద్, ఎస్.మోహన్‌రావు, సంబంధిత శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్రిస్టియన్ జేఏసీ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా సజీవకుమార్


నియామకపత్రం అందుకుంటున్న సజీవకుమార్

పాలమూరు, ఫిబ్రవరి 19 : తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్‌గా బి.సజీవ కుమార్‌ను నియమించారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్‌గా బి.సజీవకుమార్‌ను రాష్ట్ర జేఏసీ చైర్మన్ జిలుకర రవికుమార్ నియమించినట్లు ప్రకటించి నియామకపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో మేకల సారయ్య, యం.సురేందర్, కె.ఏలియా, డి.శ్యాంరావు, బి.రమేష్, విక్టర్‌పాల్, జాన్‌వెస్లీ, రాజ్‌పాల్, మనోహర్‌లు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్షప్యాడ్‌ల పంపిణీ

జడ్చర్ల, ఫిబ్రవరి 19 : జడ్చర్ల మునిసిపాలిటీలోని హరిజనవాడ జడ్పీహెచ్ఎస్‌లోని 10వ తరగతి విద్యార్థులకు ఎంబీ చర్చి యౌవన కార్యవర్గం ఆధ్వర్యంలో పరీక్షప్యాడ్‌లు, పెన్నులను అందజేశారు. సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని, నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో యౌవన కార్యవర్గం సభ్యులు సందీప్, బన్నీరాజ్, అరుణ్, క్రాంతి, కరుణ, యాకోబ్, జయరాజ్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు

- జడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య


జడ్చర్లలో మాట్లాడుతున్న జడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య

జడ్చర్ల/ బాలానగర్, ఫిబ్రవరి 19 : అభివృద్ధి పనుల విషయంలో ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రజలను తప్పుదోవపట్టించే ప్రయత్నం చేయరాదని జడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య అన్నారు. సోమవారం మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి యాదయ్య మాట్లాడారు. బాలానగర్ నుంచి గంగాపురం వరకు రూ.56 కోట్లతో సింగిల్‌లైన్ రోడ్డును డబుల్‌లైన్‌గా బీటీ రోడ్డును 2023లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మంజూరీ చేయించి, జీఓ విడుదల చేయించారని యాదయ్య గుర్తు చేశారు. అదే రోడ్డును నూతనంగా తానే మంజూరు చేయించానంటూ వెల్లడించిన ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆ జీఓ కాపీని విడుదల చేయాలని కోరారు. ఆ జీవోను చూపించిన పక్షంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ముక్కు నేలకు రాస్తామని యాదయ్య సవాల్ విసిరారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన లక్ష్మారెడ్డిని కొబ్బరికాయలు కొట్టే ఎమ్మెల్యేగా వర్ణించడం భావ్యం కాదని హితవు పలికారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే స్వాగతిస్తామని, ప్రజలను తప్పుదోవ పట్టించేవిధంగా వ్యవహరించవద్దని కోరారు. బాదేపల్లి పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, నాయకులు పాలాది రాంమోహన్, శంకర్‌నాయక్, ఇంతియాజ్‌ఖాన్, నర్సిములు, వీరేష్, రమేశ్ ఉన్నారు.

● ఇదే అంశంపై రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ మాజీ చైర్మన్ రామావత్ వాల్యానాయక్ బాలానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి గంగాపూర్ నుంచి బాలానగర్ వరకు సుమారు 25 కిలో మీటర్ల సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చడానికి రూ.56 కోట్లు మంజూరు చేయించారని గుర్తు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే తానే మంజూరు చేయించానని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తన తీరును మార్చుకోకపోతే తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. నాయకులు చెన్నారెడ్డి, గోపీనాయక్, బాలునాయక్, కళ్యాణ్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ తెలంగాణ మండల అధ్యక్షుడిగా శ్యామ్ సుందర్‌రెడ్డి


శ్యామ్ సుందర్ రెడ్డి

నవాబ్‌పేట, ఫిబ్రవరి 19 : పీఆర్టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడిగా చెన్నారెడ్డిపల్లి హెచ్ఎం శ్యామ్‌సుందర్ రెడ్డిని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపతి సింగ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంబాబు, రమాకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల నూత కమీటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షులుగా శ్యామ్ సుందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నజీర్ అహ్మద్, కోశాదికారి వి. రామక్రిష్ణ, అసోసియేట్ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, మహిళ ఉపాధ్యక్షురాలుగా అరుంధతి, ఉపాధ్యక్షులుగా బి. శ్రీనివాసులు, కార్యదర్శులుగా సునితలు ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన అధ్యక్షులు శ్యామ్‌సుందర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో నెలకొన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. తన నియమకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధ్యాయులకు తెలియకుండానే మండల కమిటీ ఎన్నిక : బాలరాజు

మండలంలో ఉపాధ్యాయులకు తెలియకుండానె కొందరు పీఆర్టీయు సంఘం పేరుతో ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేసి నూతన కమిటీలో స్థానం కల్పించారని ఆసంఘం నాయకుల మాటలు ఉపాధ్యాయులు నమ్మరాదని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు మరికంటి బాలరాజు అన్నారు. వాస్తవాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

నేటి నుంచి విజయ సంకల్ప యాత్ర ప్రారంభం

- యాత్రను ప్రారంభించనున్న కేంద్ర మంత్రి

- పోస్టర్‌ను ఆవిష్కరించిన యాత్ర ప్రముఖ్ నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), ఫిబ్రవరి 18 : భారతీయ జనతా పార్టీ అధ్వర్యంలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ పార్లమెంట్‌ల యాత్ర నేడు కృష్ణ మండలం కృష్ణానది పరివాహక ప్రాంతాల నుంచి విజయ సంకల్ప యాత్ర ప్రాంభం కానుందని యాత్ర ప్రముఖ్ నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి పరుషోత్తం రూపాలజీ ప్రారంభిస్తారని తెలిపారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయాలని, అలాగే మరోసారి భారతీయ జనతా పార్టీకి సంపూర్ణ మద్దతునిచ్చి మోదీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు. యాత్రలో భాగంగా రైతులను, చేనేత కార్మికులను, వివిధ వర్గాల ప్రజలను కలుసుకుంటూ యాత్రను కొనసాగిస్తామని, సంక్షేమపథకాల అమలు వాటి సద్వినియోగంపై ప్రజలకు తెలియజేస్తామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజ రెడ్డి, పడాకుల బాలరాజు, రాష్ట్ర నాయకులు ఏపీ మిథున్ రెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డి, కోశాధికారి పాండురంగా రెడ్డి, పడాకుల సత్యం, కిష్టునాయక్, ప్రవీణ్ యాదవ్ పాల్గొన్నారు.

జాతీయ కుంగ్ ఫూ పోటీల్లో నవాబ్‌పేట విద్యార్థులు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 19 : సోమవారం హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో నిర్వహించి నాల్గవ జాతీయ స్థాయి కుంగ్ ఫూ పోటీల్లో మండలంలోని కొల్లూర్, పోమాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ద్వితీయ స్థానం సాధించినట్లు కుంగ్ ఫూ, తైక్వాండో కోచ్ బాలరాజు సోమవారం తెలిపారు. విద్యార్థులు గౌతమ్ రాజ్, గణేష్, సైదులు కలర్ బెల్ట్ స్పైరింగ్‌లో ఈ స్థానాలు సాధించినట్లు ఆయన తెలిపారు. రంగారెడ్డి జిల్లా కుంగ్ ఫూ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ మాస్టర్‌తో పాటు విద్యార్థులను అభినందించారు.

రేపు జడ్చర్ల డిగ్రీ కళాశాలకు న్యాక్ బృందం రాక

- రెండు రోజులపాటు పరిశీలన

జడ్చర్ల, ఫిబ్రవరి 19 : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఈ నెల 21, 22వ తేదీలలో న్యాక్ బృందం వస్తున్నదని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (అలుమ్ని) అధ్యక్ష, కార్యదర్శులు పాలాది రామ్మోహన్, బాద్మి రవిశంకర్‌లు వెల్లడించారు. కళాశాలలోని అలుమ్ని కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత సంవత్సరం మే 15, 16వ తేదీలలో కళాశాలలో న్యాక్ బృందం పర్యటించి, నివేదిక ఇవ్వడంతో కళాశాలకు బీ++ గ్రేడ్ వచ్చిందని తెలిపారు. కళాశాలలో చేపట్టిన అభివృద్ధికి సరైన గ్రేడ్ దక్కలేదని, మళ్లీ న్యాక్ బృందం పర్యటించాలని కోరడంతో మరో బృందం ఈ నెల 21, 22వ తేదీలలో వస్తున్నారని వివరించారు. ఈ నెల 21న మధ్యాహ్నం 1 గంటకు పూర్వ విద్యార్థులతో న్యాక్ బృందం సమావేశం ఉంటుందని, పూర్వ విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కళాశాలకు మంచి గ్రేడ్ సాధించే అంశంలో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం సమావేశానికి రావాలని కోరారు. కళాశాలకు ఏ++ గ్రేడ్ తీసుకురావాలనే సంకల్పంతోకృషి చేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో అలుమ్ని కళాశాల కన్వీనర్ శ్రీనివాసులు, అలుమ్ని ఉపాధ్యక్షులు ఎం.బి. వరప్రసాద్ ఉన్నారు.

ఇసుక ఫిల్టర్ స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

జడ్చర్ల, ఫిబ్రవరి 19 : ఇసుక ఫిల్టర్ స్థావరంపై జడ్చర్ల పోలీసులు మెరుపు దాడి చేశారు. మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ ప్రాంగణంలో కృత్రిమ ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నట్లుగా విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 ఇసుక టిప్పర్లను పట్టుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినంగా వ్యవహరిస్తామని జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి హెచ్చరించారు. అక్రమ ఇసుకతరలిస్తున్న వారిపై పదే, పదే కేసులు నమోదైన పక్షంలో వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ ఇసుకపై నిరంతరం దాడులు చేస్తామని హెచ్చరించారు.

ఫిల్టర్ బెడ్డులను ధ్వంసం చేసిన అధికారులు

భూత్పూర్, ఫిబ్రవరి 19 : మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ గ్రామ శివారులో ఉన్న రాందాస్‌చెరువు తండా పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ పొలాల వద్ద ఏర్పాటు చేసిన అక్రమ ఇసుక ఫిల్టర్లను సోమవారం సాయంత్రం రెవెన్యూ, పోలీస్, విద్యుత్ శాఖ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించి అనుమతులు లేకుండా ఇసుకను తయారు చేస్తున్న ఫిల్టర్ బెడ్డులను ధ్వంసం చేశారు. అదే విధంగా విద్యుత్ కనెక్షన్లను తొలగించారు. దాడుల్లో తహ సీల్దార్ పులిరాజు, ఎస్ఐశ్రీనివాసులు, విద్యుత్, రెవెన్యూ అధికారులు, పాల్గొన్నారు.

తప్పుడు పేర్లతో నో పీటీ ఉత్తర్వులపై ఫిర్యాదు

జడ్చర్ల, ఫిబ్రవరి 19 : జడ్చర్ల మునిసిపాలిటీ శివారులోని ఒక ఎకరా 20 గుంటల భూమిని తప్పుడు పేర్లతో నో పీటీ ఉత్తర్వులు జారీ చేశారంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో శంకరాయపల్లి గ్రామానికి చెందిన చీకూరి ఆంజనేయులు ఫిర్యాదు చేశారు. ఆ ప్రతులను జడ్చర్లలో విలేకరులకు అందజేశారు. సర్వేనెంబరు 356లో చీకూరి కాశన్న పట్టాదారుగా, రక్షిత కౌలుదారులుగా ఉన్నారని, అందుకు భిన్నంగా తప్పుడు పేర్లతో ఉతర్వులు జారీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

'కులగణనకు చట్టబద్ధత కల్పించాలి'

జడ్చర్ల, ఫిబ్రవరి 19 : రాష్ట్రంలో కులగణన చేపట్టేందుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడాన్ని స్వాగతిస్తున్నామని, కులగణనకు చట్టబద్ధత కల్పించాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. జడ్చర్ల మండల వనరుల కేంద్రం ఆవరణలో సోమవారం బీసీ సేన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. కులగణన చేపట్టేందుకు కాలయాపన చేయకుండ, కులాల వారీగా జనాభా ప్రకటించాలని కోరారు. సమావేశంలో బీసీ సేన నాయకులు నిరంజన్, నర్సిములు, లింగంపేట శేఖర్, విజయ్‌కుమార్, గోపాల్, రఘు, గోపాల్, రాజు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగులకు అండగా యూనియన్

జడ్చర్ల, ఫిబ్రవరి 19 : వైద్య ఉద్యోగులకు రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అండగా ఉంటుందని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నిర్మల అన్నారు. జడ్చర్ల అర్బన్ హెల్త్‌సెంటర్ వద్ద సోమవారం వైద్య ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.